సాక్షి నిజామాబాద్

బుధవారం । 26 । జూలై । 2023



ఏఈవోలకు ఊరట..

రైతు వేదికల నిర్వహణ బాధ్యతలు వీఆర్ఏలకు అప్పగిస్తుండడంతో ఏఈవోలకు అదనపు బాధ్యతల భారం తగ్గనుంది.

- 10లో ▸



సొంతింటి కల నెరవేరుస్తాం

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 /23.2

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురియవచ్చు. మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐదు వేల ఎకరాల్లో పంటనష్టం

● వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా ఐదు వేల ఎకరాల వరకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో 2,700 ఎకరాల్లో వరి, 1,100 ఎకరాల్లో మొక్కజొన్న, 1,200 ఎకరాల్లో సోయాబీన్ పంట ఉన్నట్లు వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పేర్కొన్నారు. వేల్పూర్, మోపాల్, ఆర్మూర్ ప్రాంతాల్లో ఎక్కువ పంటనష్టం జరిగిందని, తుది నివేదికను త్వరలో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

అలుగెల్లిన 'రామడుగు'

ధర్పల్లి : మండలంలోని రామడుగు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరింది. దీంతో ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండిపోయింది. ప్రాజెక్టు సామర్థ్యం 966.022 ఎంసీఎఫ్‌టీలు కాగా ప్రాజెక్టులోకి 1622 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుంది. పూర్తిస్థాయిలో ప్రాజెక్ట్‌లో నీరు నిండడంతో అలుగు పైనుంచి నీరు ప్రవహిస్తుంది.

నిజాంసాగర్‌లోకి 6,400 క్యూసెక్కులు

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు పోచారం ప్రాజెక్టు వరద నీటితో పొర్లుతుండడంతో మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 6,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 11.96 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు, రేపు స్కూళ్లకు సెలవు

నిజామాబాద్‌అర్బన్ : నేడు, రేపు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో పాఠశాలలకు బుధవారం, గురువారం సెలవులు ప్రకటించారని ఆయన తెలిపారు. కేజీబీవీ పోస్టులకు సంబంధించి అర్హత పరీక్షలు మాత్రం ఎప్పటిలాగే కొనసాగుతాయని డీఈవో తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాలో 'నిధి ఆప్కే నికట్'

నిజామాబాద్ సిటీ : ఉమ్మడి జిల్లాలో ఈనెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ బి మధుసూదనాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో రుద్రూర్ మండలం కృషి విజ్ఞాన కేంద్రం అధికారి సీహెచ్‌వీ శ్రావణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా పాత రాజంపేట నర్సన్నపల్లిలో విద్యానికేతన్ హైస్కూల్ ప్రతినిధి శ్రీ నివాస్‌రావు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ కార్యక్రమం ఉంటుందన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో హాజరు కావాలన్నారు.

కృష్ణాజీవాడిలో పార్శ్వనాథుని విగ్రహం లభ్యం

● 800 ఏళ్ల క్రితందని అంచనా



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడిలో ఎనిమిది వందల ఏళ్ల క్రితం నాటిదిగా భావిస్తున్న పార్శ్వనాథుని రాతి విగ్రహం లభ్యమైంది. తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీకాంత్ మంచాల, కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వి.శంకర్ ఈ విగ్రహాన్ని గుర్తించారు. విగ్రహం ఛాతి భాగం మాత్రమే ఉండి, మిగిలిన భాగం విరిగిపోయి ఉంది. విగ్రహానికి తలవెనక భాగంలో ఏడు పడగల పాము, చెవులకు కుండలాలు ఉన్నాయి. ఈ విగ్రహం దాదాపు ఎనిమిది వందల ఏళ్ల క్రితం జైన మత ప్రాబల్యం అధికంగా ఉన్న కాలంలో చెక్కబడిందని భావిస్తున్నారు. తొలి కాకతీయుల కాలంలో ఈ ప్రాంతంలో జైనబసది ఉండే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ విగ్రహం 150 ఏళ్ల కన్నా ముందు నుంచే కృష్ణాజీవాడిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇదే గ్రామంలో చెరువు కట్ట కింద కొన్ని శిల్పాలు ఉన్నాయి. అందులో కొంత భాగం విరిగిపోయిన వేణుగోపాల స్వామి పోలికలుగల విగ్రహం ఉన్నట్టు గుర్తించారు. వీటితో పాటు నాలుగు అడుగుల రాయిపై ద్వారపాలకుడి విగ్రహం కొన్ని రాతి స్తంభాలు ఉన్నాయి. గ్రామంలో ఉన్న రాజరాజేశ్వర ఆలయ కోనేరు వద్ద ఉన్న లింగం, నంది విగ్రహాలను ఇక్కడి నుంచే ఆలయానికి తరలించారని, బహుశా ఈ జైన పార్శ్వనాథుడి విగ్రహం చెరువు కట్ట నుంచే ఇక్కడికి వచ్చి ఉంటుందని తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు శ్రీకాంత్ మంచాల తెలిపారు.



తొర్లికొండ మనోహరాబాద్ గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు

ఆరు గంటలు ఆగమాగం..

● ఆర్మూర్ డివిజన్‌లో దంచికొట్టిన వాన
● తెల్లారేలోపు చుట్టుముట్టిన వరదనీరు
● చిగురుటాకులా వణికిన వేల్పూర్, పెర్కిట్ ప్రాంతాలు
● రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదు

ఆకాశానికి రంధ్రం పడిందా అన్నట్లుగా కురిసిన వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. సోమవారం రాత్రి నుంచి ఆరు గంటలపాటు బీభత్సం సృష్టించింది. రాత్రి పడుకుని తెల్లవారుజామున లేచి చేసేవరకు అంతా ఆగమాగమయ్యింది. ఆర్మూర్ డివిజన్‌లోని వేల్పూర్, పెర్కిట్, భీమ్‌గల్, జక్రాన్‌పల్లి, కోనసముందర్ ప్రాంతాలు జలమయమయ్యాయి.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఆర్మూర్ డివిజన్‌లో వేల్పూర్, పెర్కిట్, భీమ్‌గల్, జక్రాన్‌పల్లి, కోనసముందర్ ప్రాంతాల్లో సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల వరకు కురిసిన వర్షం ఆగమాగం చేసింది. వేల్పూర్ మండల కేంద్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 46.4 సెం.మీ వర్షం కురిసింది. ఇది రాష్ట్రంలోనే అత్యధికం. రాష్ట్రంలో రెండో అత్యధిక వర్షపాతం ఆర్మూర్ మండలం పెర్కిట్‌లో 33.2 సెం.మీలుగా నమోదైంది.

అదేవిధంగా రాష్ట్రంలో నాలుగో అత్యధిక వర్షపాతం భీమ్‌గల్ మండల కేంద్రంలో 27 సెం.మీ, ఏడో అత్యధికం కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో 23 సెం.మీ, ఎనిమిదో అత్యధికం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో 22.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఇక డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో 18 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ఈ ప్రాంతాల్లో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. అనేక చోట్ల వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. నష్టం అంచనా ఇంకా తెలియరాలేదు. భారీ కుండపోత వర్షం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 73 ఇళ్లు దెబ్బతిన్నాయి. వేల్పూర్‌లో చెరువు కట్ట తెగిపోయి నీరంతా రోడ్డుపై ప్రవహించడంతో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ నీటమునిగాయి. మెయిన్ రోడ్డు డివైడర్ పైనుంచి వరద నీరు ప్రవహించింది.

తెగిన ఊర చెరువు..

వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ వద్ద ఊరచెరువు కట్ట తెగిపోవడంతో భీమ్‌గల్ వైపు రాకపోకలు నిలిచాయి. లక్కోర వద్ద చెరువు నీరు రావడంతో 63వ నంబర్ జాతీయ రహదారి కోతకు గురైంది. ఆర్మూర్ మండలం చేపూర్ వద్ద జాతీయ రహదారి కోతకు గురైంది. గోవింద్‌పేట్–సాహెబ్‌పేట్ రోడ్డు కిలోమీటరు మేర దెబ్బతింది. గోవింద్‌పేట్ గ్రామంలో ఐదు ఇళ్లు కూలిపోయాయి. ఆర్మూర్ మండలం మంథని, పిప్రి గ్రామాల మధ్య రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. మాక్లూర్ మండలం మాణిక్‌భండార్ వద్ద 63వ నంబర్ జాతీయ రహదారి జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్–తొర్లికొండ గ్రామాల మధ్య రోడ్డు తెగిపోయింది. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామం వద్ద వంతెనపై నుండి కప్పలవాగు పారింది.



వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడలో వరద ధాటికి వరిపంటలో ఇసుక మేటలు

అలుగు పారిన గుండ్ల చెరువు..

ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు అలుగు పారింది. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో వరి పొలాలు నీటమునిగాయి. డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. బోధన్ డివిజన్‌లో మోస్తరు వర్షం కురిసింది. నవీపేట మండలం మహంతంలో ఒక ఇల్లు కూలిపోయింది. సాలూరా వద్ద మంజీర, రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి ప్రవాహాలు తగ్గుముఖం పట్టాయి. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు.



ధర్పల్లిలో అలుగు పారుతున్న రామడుగు ప్రాజెక్ట్

మండలాల వారీగా వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ.లో)	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
		కోటగిరి	41.8	ఎడపల్లి	46.8
		బోధన్	52.4	నిజామాబాద్ నార్త్	69.9
వేల్పూర్	431.2	ఆలూరు	89.5	సాలూరా	53.8
నవీపేట	56.1	ఇందల్వాయి	56.0	కమ్మర్‌పల్లి	126.0
నందిపేట	45.0	మోర్తాడ్	126.3	రుద్రూరు	59.5
జక్రాన్‌పల్లి	226.5	సిరికొండ	72.3	మోస్రా	64.8
డిచ్‌పల్లి	107.9	ఆర్మూర్	141.9	మోపాల్	54.4
భీమ్‌గల్	247.6	చందూరు	52.7	ఏర్గట్ల	24.5
రెంజల్	50.8	బాల్కొండ	72.2	మెండోరా	16.4
డొంకేశ్వర్	69.5	ధర్పల్లి	97.6	ముప్కాల్	25.7
వర్ని	59.6	పోతంగల్	30.8	నిజామాబాద్ సౌత్	48.8
మాక్లూర్	57.6	నిజామాబాద్ రూరల్	44.3		



డిచ్‌పల్లిలోని రాంపూర్‌లో నేలమట్టమైన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



లక్కోరవద్ద వరదకు దెబ్బతిన్న జాతీయ రహదారి



గోవింద్‌పేట్‌లో ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు



పడగల్ చెరువు తెగి కొట్టుకుపోయిన మొక్కజొన్న



ముబారక్‌నగర్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

వరద తగ్గగానే సహాయక చర్యలు

● రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
● వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి, కలెక్టర్

వేల్పూర్ : వరద ఉధృతి తగ్గిన వెంటనే సహాయక చర్యలు చేపడుతామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షంతో వరద తాకిడికి గురైన ప్రాంతాలను మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి సందర్శించారు. జానకంపేట్, పచ్చలనడ్కుడ, వేల్పూర్‌లో తెగిన చెరువులు, దెబ్బతిన్న రహదారులను, జలమయమైన వేల్పూర్ పోలీస్‌స్టేషన్, నివాస ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 8 చోట్ల అత్యధిక వర్షం కురిసే ప్రాంతాలను రెడ్‌జోన్లుగా ప్రకటించగా, అందులో నిజామాబాద్ జిల్లాలో ఐదు ప్రాంతాలు పెర్కిట్, వేల్పూర్, భీమ్‌గల్, కోనసముందర్, జక్రాన్‌పల్లి ఉన్నాయన్నారు. అత్యధికంగా రాష్ట్ర చరిత్రలో ఆరుగంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో వేల్పూర్‌లో 46.3 సెంమీ వర్షం కురిసిందన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనమంతు మాట్లాడుతూ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. మంత్రి వెంట ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీపీవో జయసుధ, వేల్పూర్ తహసీల్దార్ రాజేందర్ అధికారులు ఉన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉన్నాం

సుభాష్‌నగర్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నందున ప్రజలు ఆందోళన చెందవద్దని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లోనే ఉంటూ పజలకు అవసరమైన సాయం చేయాలని మంత్రి ఆదేశించారు. అధికారులెవరూ సెలవుల్లో వెళ్లొద్దన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంత్రి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. వరద ఉధృతి తగ్గిన వెంటనే పాడైన రోడ్లను బాగు చేయాలన్నారు. వ్యాధులు ప్రబలితే అప్రమత్తంగా ఉండాలన్నారు.

మరో రెండ్రోజులు భారీవర్షాలు..

మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున పురాతన ఇళ్లల్లో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన వసతి కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లాలో సుమారు ఐదు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు ఇసుక మేటలు వేయడం, నీట మునగడం వల్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. 14 చోట్ల పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఆరు చోట్ల కొంత మేర కొట్టుకుపోగా, 17 ప్రదేశాల్లో రోడ్లపై నుంచి వరద ప్రవహిస్తున్నాయన్నా రు. 21 కరెంటు స్తంభాలు పడిపోయాయని, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయన్నారు. చెరువులు, వాగులు, కుంటల వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే 100కు లేదా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ మకరంద్ ఉన్నారు.



వేల్పూర్‌లో వరద ఉధృతిని కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నియామకాల్లో అర్వింద్ మార్క్..

● పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా ప్రత్యేక టీమ్ ఏర్పాటు
● క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 'ఆపరేషన్ కమలం' అన్నవిధంగా నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండోసారి విజయమే లక్ష్యంగా ఎంపీ ధర్మపురి 'ఆపరేషన్ అర్వింద్' అనేలా మార్గం ఏర్పాటు చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇందుకోసం 10 నెలల ముందు నుంచే క్షేత్రస్థాయి వ్యవహారాలను పకడ్బందీగా చక్కబెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్లేందుకు వీలుగా కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని సిట్టింగ్ ఎంపీ స్థానాలను తిరిగి గెలుపొందడంతో పాటు మరికొన్ని స్థానాల్లో పాగా వేసేందుకు గట్టిగానే కృషి చేస్తున్నారు. దీంట్లో భాగంగా క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా పర్యటించేందుకు కేంద్ర ప్రభుత్వం అర్వింద్‌కు 'వై' కేటగిరి భద్రత కల్పించింది. ఇక క్షేత్రస్థాయికి మరింత దూకుడుగా వెళ్లేందుకు గాను పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ సెగ్మెంట్ల పరిధిలో ఆయా మండలాల కమిటీలను వేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా జిల్లాలో పలు మండలాల అధ్యక్షులను నియమించారు. వీరిలో నియామకంలో పూర్తిగా ఎంపీ అర్వింద్ మార్క్ కనపడింది. పార్లమెంట్ స్థానాల విషయంలో ఏమాత్రం రాజీపడని బీజేపీ జాతీయ నాయకత్వం కూడా సిట్టింగ్ ఎంపీగా ఉన్న అర్వింద్‌కు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో ఆయన మరింత దూకుడుగా వెళుతున్నారు. మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సైతం అర్వింద్ సన్నిహితుడిగా ఉన్నారు. దీంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా అర్వింద్ 'లాంగ్‌రన్ ప్లాట్‌ఫాం' సిద్ధం చేసుకుంటున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే శాసనసభ ఎన్నికలు జరుగుతుండడంతో పార్టీ నాయకత్వం అనేక క్షేత్రస్థాయి కార్యక్రమాలకు పిలుపునిస్తోంది. తాజాగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయమై జిల్లాలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇకపై వరుసగా క్షేత్రస్థాయి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండడంతో అర్వింద్ తన మార్క్ టీంను మండల అధ్యక్షులుగా నియమించుకుంటున్నట్లు తెలుస్తోంది.



నేటి నుంచి ఆయకట్టుకు నీటివిడుదల

● కాకతీయ కాలువ నుంచి విడుదల చేయనున్న అధికారులు
● వారబందీ ప్రకారమే నీటి విడుదల
● 6.4 లక్షల ఎకరాలకు సాగునీరు
● మిగతా కాలువలకు ఖరారు కాని ప్రణాళిక



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా బుధవారం నుంచి నీటి విడుదల చేపట్టడానికి ప్రాజెక్ట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతవారం రోజుల నుంచి ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. దీంతో ఖరీఫ్ పంటకు భరోసా లభించింది. ప్రాజెక్ట్ ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీటి విడుదలపై ఇప్పటిదాకా ఎలాంటి ప్రణాళికను ప్రభుత్వం విడుదల చేయలేదు. కాని ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు వస్తే వృథాగా గోదావరిలోకి వదిలేయాల్సి ఉంటుంది. అలా జరగకుండా ఉండాలంటే సకాలంలో ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టాలని ప్రాజెక్ట్ అధికారులు నిర్ణయించారు. ఈ లెక్క ప్రకారం బుధవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపడుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ ఎగువన 6.4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ లెక్కన వారం రోజులు 5,500 క్యూసెక్కులు, మరో 7 రోజులు 3500 క్యూసెక్కులు నీటి విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్ నుంచి లక్ష్మీ, సరస్వతి కాలువల ద్వారా నీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం చేయలేదని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తికి సర్వం సిద్ధం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి టర్బయిన్‌లు సిద్ధంగా ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభమైతే విద్యుత్‌ఉత్పత్తి ప్రారంభమవుతుంది. విద్యుద్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. గత ఆర్థిక సంవత్సరం జల విద్యుదుత్పత్తి కేంద్ర చరిత్రలో రెండోసారి అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత ఏడాది కూడా ఎగువ ప్రాంతాల నుంచి వరదలు సకాలంలో వచ్చి, కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంతో విద్యుదుత్పత్తి ఎక్కువగా చేపట్టవచ్చని జెన్‌కో అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న వరద..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 40వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 63.7 టీఎంసీల నీటి నిల్వకు చేరుకుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వకు మరో 25 టీఎంసీల దూరంలో ఉంది.

❝ నీటిని సద్వినియోగం చేయాలి

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని అంచన వేస్తూ ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించాం. కాకతీయ కాలువ ద్వారా బుధవారం మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ప్రతినీటి చుక్కను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

తెయూ అడిషనల్ కంట్రోలర్‌గా శాంతాబాయి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ విభాగానికి పి శాంతాబాయిని నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మంగళవారం ఆమెకు ఉత్తర్వులను అందజేశారు. గతంలో ఆమె ఎస్సీ, ఎస్టీ సెల్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామర్‌గా, బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెల్‌కు డైరెక్టర్ గా, ఆర్ట్స్ కళాశాలకు వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు.

వాయిదా పడిన పీజీ పరీక్షల రీషెడ్యూల్ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన ఎంబీఏ, ఎంసీఏ సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్‌ను మంగళవారం కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ 2వ, 4వ సెమిస్టర్, ఐఎంబీఏ, అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ (ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు) 6వ, 7వ, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ఆగస్టు 2వరకు జరుగుతాయని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షకు 38మంది విద్యార్థులకు గాను 31మంది హాజరయ్యారు. 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 39మంది విద్యార్థులకు గాను 29మంది హాజరయ్యారని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.

మృతిచెందిన జింకకు పోస్టుమార్టం



డొంకేశ్వర్ (ఆర్మూర్): మండలంలోని చిన్నయానం వద్ద కుక్కల దాడిలో మృతి చెందిన జింకకు ఫారెస్టు, పశు వైద్య అధికారులు కలిసి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం నది ఒడ్డున ఉన్న జింక కళేబరం మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీటిలోకి వెళ్లింది. దీంతో పశువైద్యాధికారి ఇలియాస్ నీటిలో దిగి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్, తదితరులున్నారు.

ఏషియన్ గేమ్స్‌కు జిల్లావాసి మమత ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన గుగులోత్ మమత ఏషియన్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీకి ఎంపికైంది. సెప్టెంబర్ 23నుంచి అక్టోబర్8 వరకు చైనాలో జరగనున్న ఏషియన్ గేమ్స్‌కు ఆమె ఎంపికైనట్లు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ మంగళవారం తెలిపారు.

బీభత్సం సృష్టించిన వాన



కేశ్‌పల్లిలో నీట మునిగిన పంటలు



ముప్కాల్ మండల కేంద్రం శివారులో భారీ వర్షానికి పడిపోయిన మక్క



కొటార్మూర్‌లో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్



ఆర్మూర్‌లో చెరువు వద్ద యువకుల చేపల వేట



జానకంపేట్ వద్ద ధ్వంసమైన రోడ్డు

జక్రాన్‌పల్లి/వేల్పూర్/పెర్కిట్(ఆర్మూర్)/సాక్షి ఫొటోగ్రాఫర్: నిజామాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. చెరువులు, వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాల మధ్య రోడ్లు కోతకు గురయ్యాయి. అలాగే సమీపంలోని పంట పొలాలు నీటమునిగాయి. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ రోడ్డు ధ్వంసమైంది. దీంతో మనోహరాబాద్, తొర్లికొండ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.పడకల్ చెరువు కట్ట కుంగిపోయింది. దీంతో పడకల్, కేశ్‌పల్లి గ్రామాల ప్రజలు అలుగులను ధ్వంసం చేయడంతో చెరువులో వచ్చిన నీరంతా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోతున్నాయి. మాల వాగుపై 55లక్షల వ్యయంతో నిర్మించిన లోలెవల్ వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ ఈఈ శంకర్ అక్కడికి వచ్చి పరిశీలించారు. పగుళ్లు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. వేల్పూర్ మండంలోని జానకంపేట్ మల్లడి చెరువు, పచ్చలనడ్కుడ ఊరచెరువు, వేల్పూర్ మర్సుకుంట, పడగల్ నవాబు చెరువులు చెగిపోయాయి. దీంతో సుమారు రెండున్నర వేల ఎకరాల్లో వరి, మొక్క జొన్న పంటలు కొట్టుకుపోయాయి. వరిపొలాల్లో ఇసుక, మొరం మేటలు వేసింది. లక్కోర గ్రామం వద్ద 63 నంబరు జాతీయ రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించి రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆర్మూర్, మెట్‌పల్లి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం తగ్గిన తర్వాత వేల్పూర్ పోలీసులు వాహనాలను ఒక్కొక్కటిగా పంపించారు. ఆర్మూర్ మండలంలోని కొటార్మూర్ 63వ నెంబరు జాతీయ రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో కొన్ని గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. గోవింద్‌పేట్ గ్రామంలో మాలకుంట చెరువు కోతకు గురికావడంతో ఆర్అండ్‌బీ రోడ్డు ధ్వంసమైంది. అలాగే చేపూర్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు సైతం కోతకు గురైంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు మండలాల్లో వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, పంటలు, ఇళ్లను అధికారులు పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు. పలు గ్రామాల్లో చెరువు అలుగులు పారడంతో స్థానికులు చేపలు పట్టడానికి పోటీ పడ్డారు. పలుచోట్ల చేపలు విస్తృతంగా దొరకడంతో ఐదు కిలోలు చేపలను రెండు వందల రూపాయలకే విక్రయించారు. దీంతో స్థానికులు చేపలు కొనడానికి ఆసక్తి కనబరిచారు.



పెప్రిలో ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



గద్కోల్ వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న కప్పలవాగు



తొర్లికొండ చెరువు అలుగుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



ప్రవహిస్తున్న నీటిలో చేపలు పట్టుకుంటున్న స్థానికులు









పడగల్ నవాబు చెరువు తెగిపోవడంతో పొలాల్లో ప్రవహిస్తున్న వరదనీరు.. కొటార్మూర్ వద్ద కోతకు గురైన రోడ్డు.. నగరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద.. ముబారక్‌నగర్ వద్ద నిలిచిన వర్షపునీరు

కూలిన ఇళ్లు..



లింగంపేటలో కూలిన రేకుల షెడ్డు

నిజాంసాగర్/తాడ్వాయి/లింగంపేట/సదాశివనగర్/డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి పలువురి ఇళ్లు నేలకూలాయి. అలాగే కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నిజాంసాగర్, తాడ్వాయి మండలాల్లో ఒక్కో ఇల్లు కూలిపోయాయి. సదాశివనగర్ మండలంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. లింగంపేట మండలంలో ఐదు ఇళ్లు కూలిపోయాయి. మండలంలోని నెహ్రూనగర్‌కు చెందిన చాకలి మహేష్‌కు చెందిన రేకుల షెడ్డు కూలిపోవడంతో అతని కుమారుడు భరత్‌కు గాయాలైనట్లు తెలిపారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో మూడు ఇళ్లు కూలిపోయాయి. కూలిన, దెబ్బతిన్న ఇళ్లను స్థానిక అధికారులు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దని ప్రజలకు సూచించారు. ఇళ్లను కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



కొమలంచలో వర్షానికి కూలిన ఇల్లు



సంగోజివాడిలో కూలిన ఇల్లు

బీఎల్‌వో బాధ్యతలు ఎవరికి?

- గతంలో వీఆర్ఏలకు అప్పగింత
- ఇతర శాఖల్లో వీఆర్ఏల సర్దుబాటుతో నెలకొన్న సందిగ్ధం

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్ఏ)గా కొనసాగుతున్న వారిని ఫుల్‌టైం ఉద్యోగులుగా గుర్తించి ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో బూత్ లెవల్ అధికారి(బీఎల్‌వో) బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనే సందేహం వ్యక్తమవుతుంది. వీఆర్‌వో వ్యవస్థ రద్దు తరువాత వీఆర్ఏలను బీఎల్‌వోలుగా నియమించి వారితో ఓటర్ల నమోదు, జాబితాల్లో మార్పులు, చేర్పులు, ఎన్నికల తంతుకు సంబంధించిన ఎన్నో పనులను వీఆర్ఏలతో నెట్టుకవస్తున్నారు. రెవెన్యూ శాఖలో కీలకంగా ఉన్న వీఆర్ఏల వ్యవస్థ రద్దు కావడంతో గ్రామ స్థాయిలో రెవెన్యూ శాఖ కనుమరుగు కానుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. గ్రామాలలో బీఎల్‌వోలుగా ఎక్కువ మంది వీఆర్ఏలు పని చేస్తున్నారు. వీఆర్ఏల సంఖ్య తక్కువగా ఉన్న చోట అంగన్‌వాడీలు, కారోబార్‌లు, బిల్ కలెక్టర్‌లు బీఎల్‌వోగా ఉన్నారు.

ఎన్నికల విధులు ఎలా..

వీఆర్ఏలను ఇతర శాఖల్లోకి పంపించనుండటంతో రాబోయే అసెంబ్లీ, సర్పంచ్, ఎంపీ, జిల్లా పరిషత్‌ల ఎన్నికల నిర్వహణ ఎలా సాగుతుందని రెవెన్యూ అధికారుల్లో సంశయం నెలకొంది. వీఆర్ఏలలో మెజార్టీ ఉద్యోగులు బీఎల్‌వోలుగా పని చేస్తూనే ఈవీఎంలను తరలించడంలో కీలక భూమిక నిర్వహిస్తున్నారు. పోలింగ్ బూత్‌లు అన్ని వీఆర్ఏల ఆధీనంలోనే ఉండేవి. వీఆర్‌వో వ్యవస్థ రద్దు చేసిన తరహాలోనే వీఆర్ఏల వ్యవస్థను లేకుండా చేయడంపై అనేక మంది అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందుగానే వీఆర్ఏలు ఇతర శాఖల్లోకి వెళితే అసలు సమయంలో ఎవరితో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలో అర్థం కావడం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వీఆర్ఏల సర్దుబాటు వల్ల ఎన్నికల తంతుకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నయ మార్గం చూడాలని పలువురు సూచిస్తున్నారు.

జానకీబాయి వాటర్ ఫాల్స్‌లో పర్యాటకుల సందడి

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామ సమీపంలోగల అడవిలో ఉన్న జానకీబాయి వాటర్ ఫాల్స్‌కు పర్యాటకుల తాకిడి క్రమంగా పెరుగుతుంది. జానకీబాయి చెరువు నిండి జలపాతాన్ని తలపిస్తూ అలుగు పొర్లుతుండటంతో ప్రకృతి అందాలతో పాటు జలపాతం పరువళ్లను ఆస్వాదించేందుకు సందర్శకులు మక్కువ చూపుతున్నారు. సెలవు దినాల్లో వందల సంఖ్యలో సందర్శకులు జలపాతానికి రావడంతో సందడి నెలకొందని సర్పంచ్ విజయ్ తెలిపారు.



వచ్చే నెలలో జర్నలిస్ట్స్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

- అనంతపురంలో ఆగస్టు 23 నుంచి నిర్వహణ
- ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వర్కింగ్ జర్నలిస్టుల ఐకమత్యం కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి జర్నలిస్టు ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్న ట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 23నుంచి అనంతపురం పట్టణంలోని ఆర్డీటీ క్రికెట్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, అక్రిడిటేషన్ లేకపోయినా మేనేజ్‌మెంట్ ఇచ్చిన ఐడీ కార్డు ఉంటే పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జర్నలిస్టులకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. టోర్నమెంట్ విజేతకు రూ.1లక్ష నగదు బహుమతి, ట్రోఫీని అందజేస్తామన్నారు. రన్నర్ జట్టుకు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీలు అందిస్తామన్నారు. అదేవిధంగా వివిధ విభాగాల్లో రాణించిన జర్నలిస్టులకు బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, ఇతర ప్రత్యేక బహుమతులను అందజేస్తామని ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు ఆగస్టు 10లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 98491 52149, 9390997033, 7386958666ను సంప్రదించాలని సూచించారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం



వర్ని(మోస్రా)/(చందూర్): పేదవాడి సొంతింటి కల నె రవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మోస్రా మండల కేంద్రంలో 105 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంగళవారం బిల్లులను స్పీకర్ పంపిణీ పంపిణీ చేశారు. అలాగే కోటగిరి, పోతంగల్, రుద్రూర్, వర్ని మండలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు మంజూరైన బిల్లులను రుద్రూర్‌లో స్పీకర్ అందజేశారు. చందూర్‌లో 312 మంది డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు బిల్లులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 12వేల బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఇచ్చామన్నారు. గ్రామంలో స్థలం ఉన్నవాళ్లు ఇల్లు నిర్మాణానికి డబ్బులు అందజేస్తున్నామన్నారు. ఎంపీపీ పిట్ల ఉమ, జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ సాయిలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, మోస్రా వైస్ ఎంపీపీ కత్తి శంకర్,కోఆప్షన్ సభ్యులు ఫిరోజ్, ఎంపీపీ సుజాతనాగేందర్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో దొంగల హల్‌చల్

- టమాటలు, కూల్‌డ్రింక్స్, సిగరెట్లు, నగదును ఎత్తుకెళ్లిన దుండగులు

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. బస్టాండ్ సమీపంలోని కూరగాయల దుకాణం, పాన్‌షాప్, టిఫిన్ సెంటర్ తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కూరగాయల దుకాణంలో టమాటల బాక్సును, గల్లాపెట్టెలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం సమీపంలోని పాన్‌షాప్ తాళాలు పగలగొట్టి సిగరెట్లు, కూల్‌డ్రింక్స్ అపహరించారు. పక్కనే ఉన్న హోటల్‌లో చిల్లర నగదు ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి కూడా కూరగాయల షాపులో ఒక బాక్సు టమాటలు అపహరించారు. మంగళవారం ఉదయం చోరీని గమనించిన దుకాణ యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన పోకల పెద్ద రాజుకు చెందిన పాడి గేదె మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు పశువైద్యాధికారి రవికుమార్, గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో గేదె మేతకు వెళ్లగా పంట చేనులోని బోరు మోటారు స్టాటర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో మంగళవారం ఉదయం అన్నారం రాజ గంగారాం అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుత్‌షాక్‌తో మరణించింది. వివరాలు ఇలా.. గేదె మేత మేయడానకి వెళ్లగా, సమీపంలోని కరెంటు స్తంభాన్ని తాకగా విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్రగాయలు





తీవ్రంగా గాయపడిన వ్యక్తి.. ప్రమాదానికి గురైన యాక్టివా బైక్

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట శివారులోని ఈద్గా వద్ద మంగళవారం హోండా యాక్టివా బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బోధన్ వైపు నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు, నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వస్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బోధన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషయమంగా ఉంది. కారు, బైక్‌ను ఎడపల్లి ఠాణాకు తరలించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఇంకా ఫిర్యాదు అందలేదని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి మండలంలో ఇద్దరికి..

జక్రాన్‌పల్లి: మండలంలోని చాంద్‌మియాబాగ్ తండా వద్ద జాతీయ రహదారి44పై మంగళవారం రాత్రి మోటర్ సైకిల్‌ను, కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు రాములు వీడీసీ క్యాషియర్‌గా, బైరి మధు వీడీసీ సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం రాత్రి పని నిమిత్తం ఇరువురు బైక్‌పై చాంద్‌మియాబాగ్‌కు వెళ్లారు. పని ముగించుకొని తిరిగి కేశ్‌పల్లికి బయలుదేరారు. ఈక్రమంలో హైవేపై యూటర్న్ వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో రాములు, మధులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో పలువురు మృతిచెందారు. మోర్తాడ్ మండలంలో ఓ వ్యక్తి పంట కాలువలో పడి మృతిచెందగా, కోటగిరి మండలంలో మతిస్థిమితం లేని వ్యక్తి వాగు గుంతలో పడి మృత్యువాతచెందాడు. అలాగే క్యాసంపల్లి సమీపంలో ఓ రైతు బైక్ అదుపుతప్పి మృతిచెందాడు. ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించాడు.

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్య(69) అనే వ్యక్తి సోమవారం పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేడు. అతని కోసం కుమారుడు గడ్డం ఉదయ్‌కుమార్, కుటుంబ సభ్యులు అనేక చోట్ల గాలించారు. మంగళవారం పంట కాలువలో లక్ష్మయ్య మృతదేహం లభించింది. రాత్రి కాలువలో పడిపోవడంతో మరణించి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించామన్నారు.

కోటగిరిలో ఒకరు..


రుద్రూర్: కోటగిరి మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోగల వాగు గుంతలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కల్లూర్ గ్రామానికి చెందిన గంగారాం (40)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈక్రమంలో గంగారాం సోమవారం ఇంట్లోంచి వెళ్లి, తిరిగి రాలేడు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతుకుతుండగా గ్రామ శివారులోని వాగు గుంతలో మృతదేహమై కన్పించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎరువుల కోసం వచ్చి వెళ్తుండగా రైతు..



కామారెడ్డి క్రైం: ఎరువులు కొందామని జిల్లా కేంద్రానికి వచ్చిన ఓ రైతు తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన కరికె స్వామి (38) వ్యవసాయం చేసేవాడు. తన పంట పొలానికి అవసరమైన ఎరువుల కోసం మంగళవారం మధ్యాహ్నం కామారెడ్డికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి బైక్‌పై వెళ్తుండగా క్యాసంపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



మల్లయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిన్నమెడికుంది మల్లయ్య(41)కు భార్య గౌరవ్వతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా రెండేళ్ల క్రితం ఆయన తన పొలంలో బోరు వేయడంతోపాటు ఇల్లు కట్టాడు. మరుసటి యేడు పెద్ద కూతురు పెళ్లి చేశాడు. దీంతో అతనికి సుమారు రూ.12లక్షల అప్పులయ్యాయి. అప్పుల బాధ భరించలేక మల్లయ్య ఈ నెల 18న రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. మరుసటిరోజు వేకువజామునే ఈ విషయాన్ని అతడు హైదరాబాద్‌లో ఉంటున్న తన భా ర్య, కూతురు వద్దకు వెళ్లి చెప్పాడు. దీంతో అతడిని కుటుంబసభ్యులు సమీపంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఈ నెల 20న గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా సోమవారం రాత్రి మల్లయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న కాశయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ఉమేష్ తెలిపారు.

ఫ్యాక్టరీ వర్కర్‌పై దాడి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆర్మూర్‌రోడ్డు సుఖ్‌జిత్ స్టార్చ్‌మిల్ వర్క్‌షాప్‌లో పనిచేసే సోమ్‌సుందర్ అనే వర్కర్‌పై మంగళవారం ఓ వ్యక్తి దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. తూమ్ రాజు అనే వ్యక్తి ముబారక్‌నగర్‌లో సోమ్‌సుందర్‌పై గొడ్డలి కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి, అతడి బైక్‌ను ఎత్తుకుపోయాడు. బైక్‌లో డబ్బులు ఉన్నాయని బాధితుడు తెలిపాడు. బాధితుడిని తోటి కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.